ఒడిశా సీఎంగా మాఝీ

- బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకొన్న ఎమ్మెల్యేలు
- డిప్యూటీ సీఎంలుగా కనక్ వర్ధన్ సింగ్, ప్రవటి పరిదా
- నేడు కొత్త రాష్ట్ర ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవం

భువనేశ్వర్, జూన్ 11: ఒడిశా కొత్త సీఎంగా గిరిజన నేత మోహన్ చరణ్ మాఝీని బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నుకొన్నారు. ఈ మేరకు మంగళవారం జరిగిన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో నిర్ణయం తీసుకొన్నారు. ఈ సమావేశానికి బీజేపీ అధిష్ఠానం పరిశీలకులుగా కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, భూపేంద్ర యాదవ్ హాజరయ్యారు. డిప్యూటీ సీఎంలుగా కనక్ వర్ధన్ సింగ్ దియో, ప్రవటి పరిదా ఉంటారని రాజ్‌నాథ్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. మాఝీని శాసనసభాపక్ష నేతగా ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారని తెలిపారు. కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో బుధవారం జరుగనున్నది. ప్రమాణ స్వీకారానికి ప్రధాని మోదీ, పలువురు బీజేపీ సీనియర్ నేతలు హాజరుకానున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర కొత్త సీఎంగా సురేశ్ పుజారి, బైజయంత్ పాండా, అపరాజిత సారంగి, గిరీష్ ముర్ము తదితరుల పేర్లు ప్రచారంలోకి రాగా.. బీజేపీ అనూహ్యంగా మోహన్ చరణ్ మాఝీని ఎంపిక చేసింది.

రాష్ట్రంలో తొలిసారి బీజేపీ ప్రభుత్వం

రాష్ట్రంలో బీజేపీ తొలిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని అధికార బీజేడీ ఓటమి పాలైన విషయం తెలిసిందే. 147 స్థానాలు ఉన్న అసెంబ్లీలో బీజేపీ 78 స్థానాల్లో విజయం సాధించగా, బీజేడీ 51 స్థానాలకు పరిమితమైంది. దీంతో 24 ఏండ్ల నవీన్ పట్నాయక్ పాలనకు ముగింపు కార్డు పడింది. సీఎంగా తనను ఎన్నుకోవడంపై మాఝీ సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకొనేందుకు కృషి చేస్తానని, రాష్ట్రాభివృద్ధికి పనిచేస్తానని చెప్పారు.

సర్పంచ్ నుంచి సీఎం స్థాయికి..

కియోంఝర్ జిల్లా రైకల గ్రామానికి చెందిన 52 ఏండ్ల మోహన్ చరణ్ మాఝీ ఒక వాచ్‌మెన్ కుమారుడు. 1997-2000 మధ్య గ్రామ సర్పంచ్‌గా తన రాజకీయ జీవితం మొదలు పెట్టారు. మోహన్ మాఝీ అసెంబ్లీకి ఎన్నికవడం ఇది నాలుగోసారి. 2000లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004, 2019లోనూ శాసనసభ్యుడిగా గెలిచారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కియోంఝర్ అసెంబ్లీ స్థానం నుంచి బీజేడీ అభ్యర్థిపై 11 వేలకుపైగా మెజార్టీతో విజయం సాధించారు. కెరీర్ ప్రారంభంలో ఆయన ఆరెస్సెస్ ఆధ్వర్యంలో నడిచే ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో సంబంధాలు ఉన్న మోహన్ మాఝీ రాష్ట్రంలో ఒక బలమైన గిరిజన నేతగా ఎదిగారు. 2019-24 మధ్య అసెంబ్లీలో బీజేపీ చీఫ్ విప్‌గా పనిచేశారు.

కొత్త సీఎంకు అధికారిక నివాసం కరువు

రాష్ట్రంలో తొలిసారి అధికారం చేపడుతున్న బీజేపీకి సీఎం అధికార భవనం రూపంలో మొదటి సమస్య వచ్చి పడింది. 2000 నుంచి తాజా అసెంబ్లీ ఎన్నికల వరకు రెండు దశాబ్దాలకు పైగా ముఖ్యమంత్రిగా కొనసాగిన నవీన్ పట్నాయక్ భువనేశ్వర్‌లోని తన సొంత ఇంటి నుంచే కార్యకలాపాలు సాగించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర సీఎం అధికారిక నివాసం కోసం బీజేపీ, అధికార యంత్రాంగం అన్వేషణ కొనసాగించాల్సిన పరిస్థితి తలెత్తింది. అయితే కొత్త సీఎం తాత్కాలిక నివాసంగా స్టేట్ గెస్ట్ హౌస్, పలు ఇతర భవనాలను పరిశీలిస్తున్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి.

పరివార్ క్యాబినెట్

- నూతన కేంద్ర మంత్రిమండలిలో చాలా మందికి రాజకీయ కుటుంబ నేపథ్యం
- జాబితాలో కుమారస్వామి, జయంత్ చౌదరి, సింధియా, పాశ్వాన్, రిజిజు తదితరులు

న్యూఢిల్లీ, జూన్ 11: వారసత్వ రాజకీయాలు, వారసత్వ పాలన అంటూ విపక్ష పార్టీలపై పదేపదే విమర్శలు గుప్పించే ప్రధాని మోదీ.. కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాబినెట్‌లో అదే వారసత్వ నేతలకు పెద్ద పీట వేశారు. చాలా మంది రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లకే మంత్రి పదవులు కేటాయించారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ మాట్లాడే మాటలకు, చేతలకు పొంతన ఉండదనే విమర్శలు వస్తున్నాయి. కొత్త క్యాబినెట్‌లో మంత్రి పదవులు చేపట్టిన వాళ్లలో చాలా మందికి రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్నది. ఈ జాబితాలో హెచ్‌డీ కుమారస్వామి, కిరణ్ రిజిజు, జయంత్ చౌదరి, జ్యోతిరాదిత్య సింధియా, చిరాగ్ పాశ్వాన్, పీయూశ్ గోయల్ తదితరులు ఉన్నారు. కేంద్ర క్యాబినెట్‌లో మరోసారి మంత్రి అయిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా మధ్యప్రదేశ్ మాజీ ఎంపీ, మాజీ మంత్రి జయశ్రీ బెనర్జీ అల్లుడు కావడం గమనార్హం. నూతన కేంద్ర క్యాబినెట్‌ను 'పరివార్ మండల్'గా కాంగ్రెస్ నేత రాహుల్ విమర్శించారు.

1.హెచ్‌డీ కుమారస్వామి	మాజీ ప్రధాని దేవెగౌడ కుమారుడు
2.జయంత్ చౌదరి	మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ మనవడు
3.జ్యోతిరాదిత్య	మాజీ కేంద్ర మంత్రి మాధవ్‌రావ్ సింధియా కుమారుడు
4.చిరాగ్ పాశ్వాన్	మాజీ కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు
5.కిరణ్ రిజిజు	అరుణాచల్ మొదటి ప్రొటెం స్పీకర్ రిచిన్ ఖారు కుమారుడు.
6.రక్షా ఖడ్సే	మహారాష్ట్ర మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే కోడలు
7.జేపీ నడ్డా	మధ్యప్రదేశ్ మాజీ ఎంపీ, మాజీ మంత్రి జయశ్రీ బెనర్జీ అల్లుడు
8.రామ్‌నాథ్ ఠాకూర్	బీహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్ కుమారుడు
9.రామ్మోహన్ నాయుడు	మాజీ కేంద్ర మంత్రి ఎర్రన్నాయుడు కుమారుడు
10.జితిన్ ప్రసాద	మాజీ ఎంపీ జితేంద్ర ప్రసాద కుమారుడు
11.ఇందర్‌జిత్ సింగ్	హర్యానా మాజీ సీఎం రావ్ బీరేంద్ర సింగ్ కుమారుడు
12.పీయూశ్ గోయల్	మాజీ కేంద్ర మంత్రి వేద్ ప్రకాశ్ గోయల్ కుమారుడు
13.రవ్‌నీత్ సింగ్ బిట్టు	పంజాబ్ మాజీ సీఎం బియాంత్ సింగ్ కుమారుడు
14.అనుప్రియా పటేల్	అప్నాదళ్ వ్యవస్థాపకులు సోనేలాల్ పటేల్ కుమార్తె
15.కీర్తి వర్ధన్	యూపీ మాజీ మంత్రి మహారాజ్ ఆనంద్ సింగ్ కుమారుడు

కేంద్ర మంత్రుల బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: పలువురు కేంద్ర మంత్రులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. హోం, విదేశాంగ, ఆరోగ్య, ఐటీ శాఖల మంత్రులు అమిత్ షా, జైశంకర్, నడ్డా, అశ్విని వైష్ణవ్ సహా ఇతర మంత్రులు పూజా కార్యాక్రమాల అనంతరం ఆయా మంత్రిత్వ శాఖల కార్యాలయాల్లో ఆసీనులయ్యారు. బాధ్యతల స్వీకరణ అనంతరం జైశంకర్ మాట్లాడుతూ 'భారత్ ఫస్ట్, వసుధైక కుటుంబం' అనేవి దేశ విదేశాంగ విధానానికి మార్గదర్శక సూత్రాలుగా ఉంటాయని అన్నారు. పార్లమెంట్ సజావుగా నడిచేందుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. వికసిత్ భారత్ దిశగా పనిచేస్తానని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి బాధ్యతల స్వీకరణ అనంతరం అన్నారు.

ఎంవీఏ కూటమిలో లుకలుకలు

- పార్టీల మధ్య ఎమ్మెల్సీ ఎన్నికల చిచ్చు
- నాలుగు స్థానాలకు ఠాక్రే అభ్యర్థులను ప్రకటించడంపై కాంగ్రెస్ అసంతృప్తి
- రెండింటిలో శివసేన (యూబీటీ) పోటీ నుంచి తప్పుకోవాలి: నానా పటోలే

నానా పటోలే

ఉద్ధవ్

ముంబై (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ కూటమిలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. లోక్‌సభ ఎన్నికల సమయంలో సాంగ్లి స్థానంపై పోటీ విషయంపై కాంగ్రెస్, శివసేన(యూబీటీ) మధ్య విభేదాలు పొడచూపగా.. ఇప్పుడు రాష్ట్రంలో త్వరలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు మరోసారి చిచ్చుపెట్టాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) ఏకపక్షంగా తన అభ్యర్థుల్ని ప్రకటించటాన్ని కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. కొంకణ్ పట్టభద్రుల, నాసిక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ నుంచి తప్పుకోవాలని ఠాక్రేను కాంగ్రెస్ కోరింది. కూటమిలో భాగస్వామ్యపక్షాలను సంప్రదించకుండా, ఉద్ధవ్ ఠాక్రే ఏకపక్షంగా అన్ని ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించారని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే మీడియా ముఖంగా ఆరోపించారు. ముంబై, కొంకణ్ పట్టభద్రుల స్థానాలకు, ముంబై, నాసిక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు జూన్ 26న ఎన్నికలు జరగబోతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో సాంగ్లి స్థానంలో కాంగ్రెస్ నేత విశాల్ పాటిల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలబడి.. గెలుపొందటం శివసేనకు షాకిచ్చింది. సాంగ్లిలో ఓటమికి ప్రతీకారంగా ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన అభ్యర్థుల్ని శివసేన (యుబీటీ) నిలబెట్టినట్టు రాజకీయ వర్గాలు అంటున్నాయి.

ఆయన మనసులో ఏముందో?: పటోలే

కూటమిలో భాగంగా కొంకణ్ గ్రాడ్యుయేట్, నాసిక్ ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీచేయాలని కాంగ్రెస్ భావిస్తున్నది. ముంబైలోని రెండు సీట్లను ఉద్ధవ్ ఠాక్రే గ్రూపునకు వదిలేందుకు సిద్ధమైంది. అయితే అన్ని స్థానాలకు శివసేన(యూబీటీ) తన అభ్యర్థులను ప్రకటించడంపై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాను ఇంతకుముందు ఠాక్రేకు ఫోన్ చేసి, సీట్ల పంపకంపై చర్చించానని, చెరో రెండు సీట్లలో పోటీచేద్దామని చెప్పానని నానా పటోలే చెబుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల ఎవరనే వివరాలు అడిగిన ఠాక్రే.. అన్ని స్థానాలకు వాళ్ల పార్టీ అభ్యర్థులను ప్రకటించేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఠాక్రేను సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, ఆయన అందుబాటులోకి రాలేదన్నారు.

24 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కావొచ్చని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జూలై 3 వరకు సాగే ఈ సమావేశాల్లో మొదటి రెండు రోజులు ఎంపీల ప్రమాణ స్వీకారం ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ నెల 26న స్పీకర్ ఎన్నిక ఉంటుందని చెప్తున్నారు. సభాపతి పదవి తమకు ఇవ్వాలని అధికార బీజేపీ మిత్ర పక్షాలైన టీడీపీ, జేడీయూ పట్టుబడుతున్నాయి. బీజేపీ ఎంపీ పురంధేశ్వరి, టీడీపీ ఎంపీ హరీశ్ మాథుర్ స్పీకర్ రేసులో ఉన్నట్టు వార్తలొస్తున్నాయి.

లోక్‌సభ ఎన్నికలతో రాజ్యసభలో 10 ఖాళీలు

న్యూఢిల్లీ: ఇటీవల లోక్‌సభ ఎన్నికల కారణంగా రాజ్యసభలో పది స్థానాలు ఖాళీ అయ్యాయి. పది మంది ఎగువ సభ సభ్యులు లోక్‌సభకు ఎన్నిక కావడమే ఇందుకు కారణం. అస్సాం, బీహార్, మహారాష్ట్రలో రెండు సీట్ల చొప్పున; హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపురలో ఒక స్థానం చొప్పున ఖాళీలు ఏర్పడ్డాయని రాజ్యసభ నోటిఫికేషన్ తెలిపింది. ఈ రాజ్యసభ స్థానాలకు ఈసీ త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువరించనుంది.

మోదీ మంత్రివర్గంలో 99% కోటీశ్వరులే

న్యూఢిల్లీ, జూన్ 11: మోదీ మంత్రివర్గంలో ఇంచుమించు అందరూ కోటీశ్వరులే. మొత్తం 71 మందిలో 70 మంది ఆస్తులు వెల్లడించగా, 99 శాతం కోటీశ్వరులని, వారి సగటు ఆస్తులు 107.94 కోట్లని ఏడీఆర్ తెలిపింది. వీరిలో ఏపీకి చెందిన చంద్రశేఖర్ 5705.47 కోట్ల ఆస్తులతో మొదటి స్థానంలో ఉన్నారు. మొత్తం మంత్రుల్లో 28 మందిపై (39 శాతం) క్రిమినల్ కేసులుండగా, అందులో 19 మందిపై హత్య, మహిళలపై నేరాలు, విద్వేష ప్రసంగాలు వంటి తీవ్రమైన నేరారోపణలు ఉన్నట్టు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) వెల్లడించింది.

మంత్రివర్గంలో 80% గ్రాడ్యుయేట్లు

11 మంది మంత్రుల విద్యార్హత 12వ తరగతి కాగా, 57 మంది గ్రాడ్యుయేట్, ఆపై విద్యార్థతను కలిగి ఉన్నారు. మరో ముగ్గురు డిప్లొమా హోల్డర్స్.

నీట్ ఆరోపణలపై జవాబివ్వండి

మొదటిపేజీ తరువాయి...

స్పష్టం చేసింది.వైద్య విద్యలో పీజీ కోర్సుల ప్రవేశాలకు 2022లో నిర్వహించిన నీట్-పీజీ పరీక్ష ఫలితాల్లో తేడాలు ఉన్నాయని, ఆన్సర్ షీట్లు, ఆన్సర్ కీలను బహిర్గతం చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు వెకేషన్ బెంచ్ తోసిపుచ్చింది. ప్రీతీశ్ కుమార్, మరికొందరు అభ్యర్థులు దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, అహ్సానుద్దిన్ అమానుల్లాతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించింది. నీట్-పీజీ 2022 ఫలితాల్లో తేడాలు ఉన్నాయని, పునఃముల్యాంకనానికి ఈ పరీక్షలు నిర్వహించిన నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్(ఎన్‌బీఈ) అంగీకరించడం లేదని పిటిషన్‌దారులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అయితే, కాలం గడిచిపోతున్న కొద్దీ ఈ పిటిషన్లు వ్యర్థమైపోతాయని పేర్కొన్న ధర్మాసనం.. పిటిషన్‌ను తిరస్కరించింది.

అడ్మిషన్లు ఏటా రెండుసార్లు

మొదటిపేజీ తరువాయి...

అమలులోకి వస్తే పరిశ్రమలు కూడా ఏటా రెండుసార్లు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించి విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయవచ్చని వివరించారు.

తప్పనిసరి ఏమీ కాదు

ఇప్పటికే అంతర్జాతీయ ఉన్నత విద్యాసంస్థలు ఈ బైఆన్యువల్ అడ్మిషన్ విధానాన్ని పాటిస్తున్నాయని అన్నారు. ఇప్పుడు భారతీయ ఉన్నత విద్యా సంస్థలు కూడా ఈ విధానాన్ని పాటిస్తే విద్యాసంస్థల మధ్య అంతర్జాతీయ సహకారం, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలకు అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. తద్వారా ప్రపంచ స్థాయితో పోటీ పడే పరిస్థితి మెరుగవుతుందని, అంతర్జాతీయ విద్యా ప్రమాణాలకు తగ్గట్టుగా మన విద్యా ప్రమాణాలు ఉంటాయని అన్నారు. అయితే, అన్ని యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలు ఈ కొత్త విధానాన్ని పాటించడం తప్పనిసరి కాదని జగదీశ్ కుమార్ స్పష్టం చేశారు. ఆయా సంస్థలకు ఉన్న మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు, ఇతర వనరులను దృష్టిలో పెట్టుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. కాగా, ప్రస్తుతం మన దేశంలో విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు జూలై - ఆగస్టులో అడ్మిషన్లు తీసుకుంటున్నాయి. గత ఏడాది ఓపెన్, దూర విద్య, ఆన్‌లైన్ కోర్సులకు ఏడాదికి రెండుసార్లు ప్రవేశాలు చేపట్టేందుకు యూజీసీ అనుమతించింది. ఈ నిర్ణయం గత ఏడాది సుమారు ఐదు లక్షల మంది విద్యార్థులకు ఉపయోగపడిందని జగదీశ్ కుమార్ తెలిపారు.

ఆరుగురు 'ఇండియా' ఎంపీలకు అనర్హత ముప్పు!

లక్నో, జూన్ 11: యూపీలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు 'ఇండియా కూటమి'లో ఉత్సాహాన్ని నింపాయి. అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీకి 37 స్థానాలు, కాంగ్రెస్‌కు 6 స్థానాలు దక్కాయి. బీజేపీ 33 స్థానాలకు పరిమితమైంది. కూటమికి చెందిన అరడజనకు పైగా ఎంపీలు క్రిమినల్ కేసుల్ని ఎదుర్కొంటున్నారు. వీరికి జైలు శిక్ష రెండేండ్లకు మించి ఉంటే.. ఎంపీ సభ్యత్వాన్ని కోల్పోయే ప్రమాదముంది. ఘజియాపూర్ నుంచి గెలుపొందిన అఫ్జల్ అన్సారీ గ్యాంగ్‌స్టర్ కేసులో దోషిగా తేలారు. అజంగఢ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్‌పై నాలుగు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. జౌన్‌పూర్ ఎంపీ బాబు సింగ్ కుశ్వాహాపై 25 కేసులున్నాయి. ఇండియా కూటమికి చెందిన ఇతర ఎంపీలు రాంభువాల్ నిషాద్, ఎస్పీ వీరేంద్ర సింగ్, ఇమ్రాన్ మసూద్, చంద్రశేఖర్ ఆజాద్‌పై కూడా కేసులు ఉన్నాయి.

తదుపరి ఆర్మీ చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది

ఈ నెల 30న బాధ్యతలు

న్యూఢిల్లీ: తదుపరి ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత సైన్యాధిపతి జనరల్ మనోజ్ పాండే నుంచి ఈ నెల 30న ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని రక్షణ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం ద్వివేది వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా వ్యవహరిస్తున్నారు. జనరల్ పాండే మే 31నే పదవీ విరమణ చేయాల్సి ఉండగా, కేంద్రం ఆయన పదవీకాలాన్ని నెలపాటు పొడిగిస్తూ గత నెలలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నెల 30న ఆయన పదవీ విరమణ చేయనున్నారు. ఆర్మీ చీఫ్ పదవీ కాలం పొడిగించడం అత్యంత అరుదు. మరోవైపు, రేవాలోని సైనిక్ స్కూల్ పూర్వ విద్యార్థి అయిన ద్వివేది.. 1984లో 18 జమ్ము అండ్ కశ్మీర్ రైఫిల్స్‌లో చేరారు. 39 ఏండ్ల మిలిటరీ కెరీర్‌లో ఆయన నార్తర్న్, వెస్టర్న్ థియేటర్స్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు.

'అసలైన సేవకుడికి అహంకారం ఉండదు'

నాగపూర్: నిజమైన 'సేవకుడి'కి అహంకారం ఉండదని, ప్రజాజీవితంలో హుందాతనంతో ఉంటాడని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. నిజమైన సేవకుడు మర్యాదతో ప్రజలకు సేవ చేస్తాడని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం మొదటిసారిగా నాగపూర్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో భాగవత్ మాట్లాడారు. 'నేనే చేశాను, నా వల్లే సాధ్యమైంది' అన్న అహంకారం లేని వ్యక్తికే సేవకుడిగా పిలిపించుకునే హక్కు ఉంటుందని అన్నారు. మరోవైపు అతి విశ్వాసంతో ఉన్న బీజేపీ కార్యకర్తలకు, నాయకులకు లోక్‌సభ ఫలితాలు వాస్తవ పరిస్థితులను తెలియజేశాయని ఆరెస్సెస్ పత్రిక ఆర్గనైజర్ పేర్కొంది. బీజేపీ నాయకులు చాలామంది ఇప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభలో వెలిగిపోతున్నామన్న భ్రమలో ఉన్నారు తప్ప వీధుల్లో సామాన్యులు చెప్పే మాటలను వినడం లేదని వ్యాఖ్యానించింది.

'నిర్మలకు ఏం అర్హత ఉంది?'

చెన్నై, జూన్ 11: బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన నిర్మలా సీతారామన్, జైశంకర్‌కు కేంద్ర క్యాబినెట్‌లో చోటు కల్పించి, ముస్లిం వర్గానికి చెందిన ఒక్కరికి కూడా మంత్రివర్గంలో చోటివ్వకపోవడంపై తమిళనాడులోని డీఎంకే వర్గాలు, ద్రవిడవాదులు విమర్శలు గుప్పిస్తున్నారు. '3 శాతం నూలిబాన్స్'కు మంత్రివర్గంలో చోటిచ్చారు.. 18 శాతమున్న ముస్లింలకు కేంద్ర మంత్రి అయ్యే అర్హత లేదా?' అంటూ డీఎంకే అధికార ప్రతినిధి తమిళన్ ప్రసన్న ఓ న్యూస్ ఛానల్ చర్చా కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బ్రాహ్మణులను తాలిబాన్లతో పోల్చుతూ డీఎంకే వర్గాలు, ద్రవిడవాదులు తమిళనాట ప్రాచుర్యంలోకి తీసుకొచ్చిన పదమే 'నూలిబాన్స్'. వామపక్ష వాదులు కూడా దీనికి గొంతు కలుపుతున్నారు. ఎలాంటి అర్హతలూ లేని నిర్మలా సీతారామన్‌కు కేంద్రమంత్రి పదవి ఇచ్చారు. దేశ జనాభాలో 18 శాతమున్న ముస్లింలకు అర్హత లేదని.. ఎలా నిర్ణయిస్తారు?' అంటూ ప్రసన్న టీవీ డిబేట్‌లో రెచ్చిపోయారు.

ఢిల్లీలో చీకట్లు

- యూపీ పవర్‌గ్రిడ్‌లో అగ్నిప్రమాదం
- నగరానికి ఆగిన విద్యుత్తు సరఫరా
- జాతీయ మౌలిక సదుపాయాల వైఫల్యం వల్లే ఈ పరిస్థితి
- ఢిల్లీ మంత్రి ఆతిశీ విమర్శలు

న్యూఢిల్లీ, జూన్ 11: ఇప్పటికే వడగాల్పులు, నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న దేశ రాజధాని ఢిల్లీ ప్రజలపై మరో పిడుగు పడింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి నగరవాసులకు కరెంట్ కోతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని మండోలాలో ఉన్న పవర్‌గ్రిడ్‌లో అగ్నిప్రమాదం సంభవించడంతో నగరానికి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మండోలా పవర్ గ్రిడ్ నుంచి ఢిల్లీకి 1,500 మెగావాట్ల విద్యుత్తు సరఫరా అవుతుంది. పవర్ గ్రిడ్ విఫలమవడంతో నగరంలోని పలు ప్రాంతాల ప్రజలు కరెంట్ కోతలు ఎదుర్కొంటున్నారని ఢిల్లీ మంత్రి ఆతిశీ వెల్లడించారు. ఢిల్లీలో కరెంట్ కోతల నేపథ్యంలో తమ ఏరియాల్లో చాలా సమయం నుంచి కరెంట్ లేదంటూ పలువురు నగరవాసులు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు చేశారు. ఢిల్లీలో ఉష్ణోగ్రతలు ఇప్పటికే 40 డిగ్రీల సెల్సియస్ కంటే అధికంగా నమోదవుతున్న క్రమంలో తాజా పరిణామం నగరవాసులకు మరింత ఇబ్బందికరంగా మారింది. 'ఈరోజు మధ్యాహ్నం 2.11 గంటల నుంచి ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో భారీగా కరెంట్ కోతలు ఉన్నాయి. నగరానికి 1,500 మెగావాట్ల విద్యుత్తు సరఫరా చేసే మండోలా పవర్‌గ్రిడ్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ నేపథ్యంలో ఇతర విద్యుత్తు సరఫరా వనరులకు లింక్ చేస్తున్నాం' అని ఆతిశీ పేర్కొన్నారు. దేశ విద్యుత్తు సరఫరా కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉంటుందని, తాజా సమస్యపై మాట్లాడేందుకు కొత్త విద్యుత్తు మంత్రి అపాయింట్‌మెంట్ కోరుతానని తెలిపారు. జాతీయ స్థాయి పవర్‌గ్రిడ్ విఫలం కావడం, విద్యుత్తు మౌలిక సదుపాయాలు నిలిచిపోవడం ఆందోళనకరమని ఆతిశీ అన్నారు. 8,000 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్‌కు చేరిన సమయంలో కూడా ఇలాంటి సమస్య తలెత్త లేదని, జాతీయస్థాయిలో మౌలిక సదుపాయాల వైఫల్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని కేంద్రాన్ని విమర్శించారు.

ఐఫోన్‌లోనూ చాట్‌జీపీటీ

ఓపెన్‌ఏఐతో యాపిల్ ఒప్పందం

న్యూయార్క్, జూన్ 11: ఈ ఏడాది చివరి నాటికి ఐఫోన్‌లలో చాట్‌జీపీటీని అందుబాటులోకి తీసుకురానున్నట్టు యాపిల్ సంస్థ ప్రకటించింది. ఇందుకుగానూ ఓపెన్ ఏఐ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు సోమవారం జరిగిన వరల్డ్ వైడ్ డెవెలపర్స్ కాన్ఫరెన్స్‌లో వెల్లడించింది. చాట్‌జీపీటీ తర్వాత మరిన్ని ఏఐ ఫీచర్లను కూడా తీసుకురానున్నట్టు తెలిపింది. చాట్‌జీపీటీని ఉచితంగా వినియోగించుకోవచ్చని తెలిపింది. ఐఓఎస్18లో కాల్ రికార్డింగ్, ట్రాన్స్‌క్రైబ్ ఆప్షన్లు తేనున్నట్టు తెలిపింది. యూజర్లు ఇక కాల్స్‌ను రికార్డు చేయవచ్చని, కాల్ రికార్డు అవుతున్నట్టు అవతలి వారికి నోటిఫికేషన్ వెళ్తుందని తెలిపింది. ట్రాన్స్‌క్రైబ్ ఆప్షన్ ద్వారా కాల్‌లో మాట్లాడింది టెక్ట్స్ రూపంలోకి కూడా వస్తుందని పేర్కొన్నది. యాపిల్ వాయిస్ అసిస్టెంట్ 'సిరి'ని కూడా ఏఐ టెక్నాలజీతో పూర్తిగా పునరుద్ధరించనున్నట్టు వెల్లడించింది.

యాపిల్ గాడ్జెట్లను నిషేధిస్తాం: మస్క్

చాట్‌జీపీటీ కోసం ఓపెన్‌ఏఐతో యాపిల్ జట్టుకట్టడాన్ని టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ తప్పుబట్టారు. ఇది భద్రతా ఉల్లంఘన అని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఆపరేటింగ్ సిస్టమ్ స్థాయిలో చాట్‌జీపీటీని అనుసంధానం చేస్తే తమ సంస్థల్లో యాపిల్ గాడ్జెట్లను నిషేధిస్తామని హెచ్చరించారు.

కిక్కిరిసిన వందేభారత్!

*న్యూఢిల్లీ: దేశంలోని రైళ్లు ప్రయాణికులతో కిటకిటలాడటం మనం నిత్యం చూస్తూనే ఉంటాం. అయితే ప్రీమియం రైళ్లు అయిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లలోనూ ఇదే పరిస్థితి నెలకొంటున్నది. టికెట్‌లేని ప్రయాణికులు ఈ లగ్జరీ రైళ్లలో ఎక్కుతుండటంతో